క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన బొలగాని ఉమ మహేశ్వరరావుకు ఎమ్మెల్యే కోన రఘుపతి తన ఇంటి వద్ద శనివారం రూ.1.20లక్షల చెక్కు అందజేశారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, సర్పంచ్ యెహోషువా, నాయకులు ప్రసాద్ తాజుద్దీన్ ఉన్నారు.

వెల్ఫేర్ సెక్రటరీ రాఘవరావుకు డాక్టరేట్



రేపల్లె రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపకురాలు ప్రొఫెసర్ ఎన్.నిర్మలమణి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసి ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కె.మధుబాబు చేతుల మీదుగా రేపల్లె మున్సిపాలిటీలో వెల్ఫేర్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న చిల్కా రాఘవరావు ఇటీవల డాక్టరేట్‌ను అందుకున్నారు. గిరిజన తెగల ఆర్థిక అభివృద్ధిపై విత్తన సంస్థలు ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి అనే అంశంపై విశాఖపట్టణం జిల్లాలోని గిరిజన మండలాలలో పరిశోధన చేసినందుకుగాను ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రాఘవరావుకు మున్సిపల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరులో శనివారం వీఆర్వో సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను గ్రామ మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. స్థానిక ఎస్టీ కాలనీలో జరిగిన ఈ వేడుకలలో భాగంగా 40 మంది స్టడీ సెంటర్ చిన్నారులకు 115 మంది మ్యాక్స్ గ్రూప్ సభ్యులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. వీఆర్వో సంస్థ ద్వారా వేమూరు, రేపల్లె నియోజకవర్గాల పరిధిలోని నాలుగు మండలాలలోని 710 మందికి ఈ కానుకలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జీసీ స్కూల్ టీచర్ కృష్ణప్రియ, వీఆర్వో సంస్థ వలంటీర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

'యడ్లపల్లి' విద్యార్థులకు జిల్లా చాంపియన్‌షిప్



చుండూరు(భట్టిప్రోలు): గుంటూరు బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ చూపి జిల్లా చాంపియన్‌షిప్ సాధించారు. మొత్తం 24 మంది విద్యార్థులు ఈ అథ్లెటిక్స్ పోటీలలో పరుగు పందెం, రిలే పరుగు పందెం, లాంగ్ జంప్, రిలే లాంగ్ జంప్‌లలో వివిధ విభాగాలలో పాల్గొనగా 9 మంది ప్రథమ, 10 మంది ద్వితీయ, ముగ్గురు తృతీయ స్థానాలు సాధించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ వేమూరి శరత్‌బాబును జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకటేశ్వరరావు, హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పార్టీ గెలుపునకు సమన్వయంతో కృషిచేద్దాం

- సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పరిచయ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును పరిచయం చేస్తున్న మంత్రి నాగార్జున

వేమూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన వరికూటి అశోక్‌బాబు పరిచయ కార్యక్రమం శనివారం స్థానిక వేమూరు మార్కెట్ యార్డులో శనివారం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ పార్టీ గెలుపుకోసం అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం వరికూటి అశోక్‌బాబును నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ తాను దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్ సీపీలో చేరి 2014లో పోటీచేసి స్వల్ప తేడాతో ఓడిపోవడం జరిగిందని తెలిపారు. 2019లో వేమూరులో 10 వేల మెజారిటీతో గెలుపొందడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో స్థానం కల్పించారన్నారు. వేమూరు నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను కృషి చేయడం జరిగిందన్నారు. రైతులు సాగు చేస్తున్న లంక గ్రామాల్లో పొలాలకు పట్టాలు ఇప్పించేందుకు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. త్వరలో రైతులకు పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జంపని షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇప్పించడం జరిగిందని ఆయన తెలిపారు. వేమూరు నియోజకవర్గం అభివృద్ధికి వరికూటి అశోక్‌బాబు సహకారంతో అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. వరికూటి అశోక్ బాబును గెలిపించి అసెంబ్లీకి పంపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాపుడా చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, డాక్టర్ వరికూటి చక్రపాణి, వరికూటి లక్ష్మి, మేరుగ చందన్‌నాగ్, నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

పార్టీ ఘనవిజయానికి కృషి..

వేమూరు: వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. నియోజకవర్గం కేంద్రం వేమూరు మార్కెట్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు చేసేందుకు వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గం ఇన్‌చార్జిగా తాను బాధ్యతలు నిర్వహించడం జరిగిందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున సహకారంతో వేమూరులో పార్టీ ఘనవిజయానికి కృషి చేస్తానని తెలిపారు. తాను ఇక్కడే నివాసం ఉండి, ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు.

ఐకమత్యంతో పనిచేస్తేనే అభివృద్ధి

- ఎంపీపీ లలిత కుమారి



మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ లలిత కుమారి, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుడు

భట్టిప్రోలు: మండల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పనిచేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి కోరారు. భట్టిప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ లలిత కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా కృషి చేస్తేనే జగనన్న ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులను గూర్చి సభ్యులకు వివరించారు. ఎజెండాలో పేర్కొన్న అంశాలను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు.

జీఓ18 అమలు చేసి అంగన్‌వాడీలను సీఎం ఆదుకున్నారు..

కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు 6 నెలల ముందు వరకు టీడీపీ హయాంలో అంగన్‌వాడీలకు రూ.7 వేలు, హెల్పర్లకు రూ.4,500 జీతం ఉండేదని, చంద్రబాబు ఎన్నికల ఓట్ల కోసం జీఓ 18 ఇచ్చి గాలికి వదిలేశాడని ఆరోపించారు. జగనన్న సీఎం అయిన వెంటనే జీఓ 18 అమలు పరచి అంగన్‌వాడీలకు రూ.11,500లు, హెల్పర్లకు రూ. 7 వేలు పెంచారన్నారు. ఇది మరచి అంగన్‌వాడీలు ధర్నాలు చేయడం విచారకరమని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఆయా శాఖాధికారులు తమ తమ శాఖకు సంబంధించిన లబ్ధిని గూర్చి వివరించారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాలకు ఇంటింటా చెత్త సేకరణకై వచ్చిన 28,670 డస్ట్‌బిన్‌లను సెక్రటరీలకు అందచేశారు. సమావేశంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, సూపరింటెండెంట్ జలజ, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకు పోటీ పరీక్షలు దోహదం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు టాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయని పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఎల్ జ్ఞానేశ్వరి తెలిపారు. శనివారం పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలలో కావూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.వైష్ణవి ప్రథమ స్థానం, పిట్టలవానిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి డి.షణ్ముఖ మణికంఠ ద్వితీయస్థానం, ఖాజీపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి బి.శివబ్రహ్మారెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఎల్ జ్ఞానేశ్వరి బహుమతులు అందజేశారు. ఈ టాలెంట్ టెస్టుకు పిట్టలవానిపాలెం, నగరం, కర్లపాలెం, చెరుకుపల్లి మండలాల పరిధిలోని పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, యాజలి, పెదపల్లె గొల్లపాలెం, మంతెనవారిపాలెం, చందోలు, చినమట్లపూడి, కావూరు, అల్లూరు పాఠశాలల నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారని ఆమె తెలిపారు. అధ్యాపకులు డి.మాధవి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం అంచనాలు పరిశీలన



చంపాడులో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న ఏఓ

చంపాడు(వేమూరు): తుఫాన్ వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. వేమూరు మండలంలోని చంపాడు గ్రామంలో పంట నష్టం అంచనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18 నాటికి అంచనాలు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు, కౌలు రైతులు త్వరగా పంట నష్టం అంచనాకు సహకరించాలని ఆమె కోరారు. ఇప్పటివరకు 10,500 ఎకరాలకు పంట నష్టం అంచనా వేయడం జరిగిందన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి 22 వరకు రైతు భరోసా కేంద్రంలో పంట నష్టపోయిన రైతులు జాబితా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతులందరూ జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై అంగన్‌వాడీల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

- డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ నాయకులు

తెనాలిఅర్బన్: వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులపై కొందరు అంగన్‌వాడీలు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శేషుబాబు, తెనాలి అధ్యక్షుడు వంశీ కిరణ్, తెనాలి రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడు పి.వీరేంద్రప్రసాద్‌లు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శనివారం తెనాలి పట్టణంలో ఇలాంటి ఘనట జరిగిందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విధి నిర్వహణ చేస్తున్నామని, తమ విధులకు అంగన్‌వాడీలు ఆటకం కలిగించవద్దని సూచించారు. ఇలాంటివి పునరావృతం అయితే ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రకటనపై సతకం చేసిన వారిలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.నరేష్, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు సీహెచ్ ఆనంద్, ఎ.నాగార్జున, పి.ఆశదీప్, షేక్ మున్నీసా బేగం, బి.సతీష్, కె.శ్రీనివాసరావు, రాజ్‌కుమార్ ఉన్నారు.

గిరిజనులకు నిత్యావసరాలు అందజేత



కర్లపాలెం: పూరి గృహాలలో నివసిస్తున్న గిరిజనులకు నివాస గుడారం, నిత్యావసర సరుకులు అందజేయటం అభినందనీయమని తహసీల్దార్ కేశవ నారాయణరావు తెలిపారు. కర్లపాలెం మండలంలోని పేరలి, తుమ్మలపల్లి, చింతాయపాలెం, కర్లపాలెం గ్రామాల పరిధిలో పూరిగృహాల్లో నివసిస్తున్న 66 కుటుంబాలలోని గిరిజనులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నివాస గుడారం పరదాపట్టా, నిత్యావసర సరుకులు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం మండల చైర్మన్ పోలీస్‌రావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా చైర్మన్ నారాయణభట్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యులు పరమానందకుమార్, ధనుంజయ్‌రావు, వెంకటరెడ్డి, నరేంద్ర తదితరులు ఉన్నారు.

కుష్ఠు సర్వేను సక్రమంగా నిర్వహించండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో త్వరలో నిర్వహించున్న కుష్ఠు వ్యాధి నిర్ధారణ సర్వేను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27నుంచి జనవరి 12వరకు కుష్ఠు వ్యాధి నిర్ధారణ సర్వేను ప్రభుత్వం నిర్వహించనున్నట్లు చెప్పారు. అందరూ దీనిలో పాల్గొనాలని సూచించారు. లెప్రసీ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ దాసరి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో జానపద కళా సదస్సు

తెనాలిఅర్బన్: అభ్యుదయ కళాసమితి తెనాలి వారి ఆధ్వర్యంలో కొత్తపేటలోని అతిథి హోటల్‌లో జానపద కళా సదస్సు నిర్వహించనున్నట్లు కన్వీనర్ బొల్లిముంత కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రచయిత, జానపద కళల విశ్లేషకులు బేరం సుందరరావు, పలువురు జిల్లా జానపద కళాకారులు పాల్గొంటారని చెప్పారు. సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అవహంతి హోమం

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని మహా విద్యా పీఠంలో జగద్గురు ఆదిశంకరాచార్య సహిత అభయ హస్త సుబ్రహ్మణ్య స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రాతఃకాల పూజ, మూలమంత్ర అనుష్టానం జరిపారు. అనంతరం జగద్గురు ఆదిశంకరాచార్య స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అవహంతి హోమం జరిపారు. విద్యాపీఠం వ్యవస్థాపకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సైనికుల ధీరత్వాన్ని స్మరించుకుందాం

తెనాలిఅర్బన్: పాకిస్తాన్‌పై 1971లో జరిగిన యుద్ధంలో భారత సైనికులు చూపిన తెగువ అందరూ స్మరించుకోవాలని 22వ బెటాలియన్ పీఐ స్టాఫ్ సుబేదార్ అవతార్ సింగ్, ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబీలు తెలిపారు. 22వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో శనివారం విజయ దివాస్ సెమినార్‌ను నిర్వహించారు. పాకిస్థాన్, ఇండియా మధ్య జరిగిన రెండు యుద్ధాలను గురించి విద్యార్థులకు వివరించారు. సమావేశంలో ఎన్‌సీసీ అధికారులు చిలకా సుందరావు, బి.శ్రీనివాసరావు, పరిశ సర్దార్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సావిత్రమ్మ స్కూల్‌కు పూర్వవిద్యార్థుల వితరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న స్కూల్ పూర్వ విద్యార్థులు

రేపల్లె రూరల్: మండలంలోని వడ్డీవారిపాలెం శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1974-75 సంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు శనివారం చేయూతనందించారు. హైకోర్టు న్యాయవాది వి.చెంచునాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రూ.40వేల విలువ చేసే కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. అదేవిధంగా మండలి రత్నారావు, అక్బర్ ఆలీఖాన్‌లు సైన్స్ తరగతులకు ఉపయోగపడే రూ.10వేల విలువ చేసే వివిధ పరికరాలను అందించగా, కస్తూరి రాజేశ్వరరావు విద్యార్థులకు అవసరం అయ్యే రూ.17,500 విలువ చేసే కుర్చీలను అందజేసి పాఠశాల షెడ్డు నిర్మాణానికి అవసరమయ్యేందుకు రూ.లక్షను ప్రకటించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాధవి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేసిన పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- సాంఘిక సంక్షేమశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రాజ డెబోరా



పరీక్ష కిట్లను అందజేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రాజ డెబోరా

రేపల్లె: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని రాబోవు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జె.రాజడెబోరా అన్నారు. పట్టణంలో బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన ప్రతిభకు ప్రేరణ శిక్షణా తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలో చదువుకునే సమయంలో ఎటువంటి సందేహాలు కలిగినా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోటరీ క్లబ్ అందజేసిన పరీక్ష కిట్లను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు సక్సేనా, పీఎస్ఎస్ ప్రసాద్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి కట్టా సత్యనారాయణ, వార్డెన్‌లు పీఎస్ఎస్ ప్రసాద్, కె.శ్రీనివాసరావు, సుజాత, లక్ష్మీప్రసన్న, పద్మావతి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

శివలక్ష్మిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

బాపట్ల: కొండపాటూరు గ్రామంలో రజక మహిళపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ధోబి మహాసంగ్ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న నిడుబ్రోలు శివలక్ష్మిని అన్నవరపు నాగమల్లేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కొండపాటూరు గ్రామంలో చెరువును ఆక్రమించారని ప్రశ్నించినందుకు నిడుబ్రోలు శివలక్ష్మి ఇంటిపై దాడి చేసి, జుట్టు పట్టుకొని బయటికి ఈడ్చి, దుస్తులు చింపి, ఆమెను కడుపులో తన్ని అవమానకరంగా ప్రవర్తించిన ఎంపీటీసీ భర్త పటకమూరి బ్రహ్మాజీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కుల దూషణ చేసి మహిళ అని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడి చేసిన వారిని దిశ చట్టం కింద కేసు నమోదు చేయాలని అన్నారు. పరామర్శించిన వారిలో రజక సంఘం నాయకులు బాపట్ల రవికుమార్, పూర్ణ, స్వామి, సాంబయ్య, గోపి, వంశీకృష్ణ, జై భీమ్ నియోజకవర్గ అధ్యక్షుడు బదుగు భరత్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శీలం రోజన్ బాబు తదితరులు ఉన్నారు.

రూ. 60 లక్షల పనులకు రికార్డులు సక్రమమే

- డీఆర్‌డీఏ డీఎల్‌డీఓ (డ్వామా) బాపట్ల జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త
- ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నదే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్దేశం
- అప్పటి జేఈ, టీఏలను విచారించిన ఏపీడీ

భట్టిప్రోలు: ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద చేసిన ప్రతి పనికి ఎం.బుక్, రికార్డులలో నమోదు చేయడం, నోట్‌క్యామ్ ఫోటోలు తీయడం తప్పని సరి అని డీఆర్‌డీఏ డీఎల్‌డీఓ (డ్వామా) బాపట్ల జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త తెలిపారు. భట్టిప్రోలు మండలంలో డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖల పరిధిలో ఉపాధి హామీ కింద ఎటువంటి పనులు జరగలేదని ఇటీవల భట్టిప్రోలుకు చెందిన తూనుగుంట్ల సాయిబాబా స్పందనలో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశానుసారం ఆమె శనివారం భట్టిప్రోలు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులు, ఎం.బుక్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి అవినీతి జరగలేదని నిర్ధారించారు. 13 పనులకు సంబంధించి రూ. 60 లక్షలతో నిర్వహించిన పనులకు రికార్డులు అన్నీ సక్రమంగానే ఉన్నాయని తెలిపారు. అవినీతి జరిగిందని ఫిర్యాదు చేసిన సదరు వ్యక్తికి సమాచారం అందజేయడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం గురజాల నియోజకవర్గ పరిధిలోని రాజుపాలెం జేఈగా పని చేస్తున్న జయచంద్రకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు ఎం.రామకోటి, పి.సుధీర్‌లను ఆమె పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పనులన్నీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పర్యవేక్షణలో జరిగాయని చెప్పారు. ఇందులో ఎటువంటి అక్రమాలకు తావు లేదని పేర్కొన్నారు.

పెదపులివర్రులో వికసిత్ భారత్ యాత్ర



యాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది

పెదపులివర్రు(భట్టిప్రోలు): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలోని అన్ని గ్రామాల ప్రజలకు తెలియ చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్ తెలిపారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు సచివాలయం పరిధిలో శనివారం ఈ కార్యక్రమం ఈవోపీఆర్డీ టి.ఊహారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన వారితో మాట్లాడించడం జరిగింది. అర్హులైన లబ్ధిదారులకు పథకాలను గూర్చి వివరించారు. వెల్లటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యురాలు సీహెచ్ రామలక్ష్మి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సుగ్గున గణేష్‌బాబు, వేమూరు నియోజకవర్గ కన్వీనర్ గల్లా వెంకయ్య, మండల అధ్యక్షులు నాదెళ్ల ప్రభాకరరావు, మాజీ ప్రధాన కార్యదర్శి జగన్నాథశాస్త్రి, మండల కన్వీనర్, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి శౌరి జోజి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రావూరి సౌమ్య, శివకృష్ణ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు నీలా రమేష్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.